# ఎర్రపూల అంగీ

"ఇంకో మూడు రూపా యలు జమైతే ఎర్రపూల అంగీ కొనేసుకోవచ్చుకదా?"

కేవలం ఒక ఎర్రపూల అంగీ కోసం నల్గొండ నుంచి మద్రాసుకి ఎవరైనా ప్రయాణమై వస్తారా?

రవి కళ్ళలో ఉత్సాహాన్ని చూసి కిషన్ మనసు చలించి ద్రవించింది. ఉప్పొంగిన మనో వికారం కన్నీరయింది.

"ఎర్రపూవుల షర్టు మీద నీకంత మోజా రవీ?" పెదవులకు కన్నీరు ఉప్పగా తగిలింది.

"నా సొంత పైసలతోటి కొనాలంటే శానా ఇష్టం! ఇంకెన్ని రోజులుంటది మీ దుకాణంల?"

"నువ్వు కొనగలిగేంత వరకు. మరెవ్వరూ



కొనరాకుండా బొగ్గుతో గీతలు గీసాను. మా ఓనరు ఉతికించడు. ష్రింక్ అయి అమ్ముడుపోదేమో అన్న భయం''

''నిజంగా ముడుచుకుపోతదా?''

''ఉహూ! అది ధరగల బట్ట. ముడుచుకుపోదు. ప్రొద్దున్నే ఏమైనా తిన్నావా రవి?''

''బన్ను' నిరాసక్తంగా చెప్పాడటు రవి.

''నీ డబ్బంతా నా దగ్గిర దాస్తున్నావెందుకు ?''

ఇన్ని రోజులెందుకు అడగలేదు?

అనవసరంగా ఖర్చయిపోతుందనా?

''ఎర్రపూవులంగీ కొనేటంత ధరకు అనవసరమైన ఖర్చేదీ ఉండదు...''

రవి చూపు షో కేసులోని ఎర్రపూవుల షర్టుపై వాంఛతో కేంద్రీకృతమై ఉంది.

''.... మరెందుకు?''

''అర్థం కాలే? ప్లాట్‌ఫాం మీద పండుకుని నిద్రపోయేటోణ్ని నేను. రాత్రిపూట ఎవరైనా బద్మాష్‌లు చోరీ చేస్తరని... నీ దగ్గరైతె భద్రం గుంటదని!''

''కిషన్...!''

అంబికా క్లాత్ ప్యాలెస్‌లోనుంచి కేక వినిపించింది.

షాపు అప్పుడే తెరిచి లోపల వెంకటేశ్వర్ల ఫోటోకి ప్రొప్రయిటరు హారతి పడుతున్నాడు. చేమంతి పూవుల పరిమళంతో అగరొత్తుల సువాసన కలిసి రాత్రంతా బంధించబడిన మురుగుడు గాలిని పారద్రోలుతోంది.

సిబ్బంది అంతా హారతి కళ్లకద్దుకుని కౌంటర్స్ వెనక్కి చేరుకున్నారు. పట్టుచీరెలు కొనవచ్చిన కస్టమరుకి కూల్‌డ్రింకు తీసుకురావడానికి కిషన్ అవతలికి వచ్చాడు. రవి ఇంకా షర్టువైపు తదేకంగా చూస్తూ ఉన్నాడు.

''రవీ! పనికి వెళ్ళలేదా?''

''మూడు రూపాయలైతే సరిపోతది కదా?''

''ఇదిగో! ఇక్కడ చూసుకుంటూ నించుంటే మూడు రూపాయలు ఆకాశం నుంచి రాలిపడవు. పనికి వెళ్ళు. మధ్యాహ్నం నాతో తిండానికి వొచ్చేయి. ఏం?''

రవి లాగు సర్దుకుని రోడ్డుకడ్డంగా పరుగెత్తాడు. పన్నెండేళ్ళు నిండని ఈ ఇద్దరి పిల్లవాళ్ళ ఆర్థిక స్వాతంత్ర్యానికి గర్వించాలా లేక బాధలు తెలీకుండా హాయిగా ఆటలాడుకునే ప్రాయంలో తిండికి తిప్పలుపడే దయనీయమైన వీళ్ళ

# అంగీఖరీదులో సర్దుబాటుకాని మనసు

దైనందిన జీవితానికి చింతించాలా: కనడం తగ్గించమన్నాం! పుట్టిపెరుగుతూ సమాజానికి చెందకుండా, సజావైన జీవితగతిలో చేరలేకపోతున్న ఈ ఎడొలెసెంట్ ఔట్‌లాస్‌కి ఏదైనా చేస్తున్నామా?

ఎవరో ఖరీదైన దంపతులు, ఖరీదైన కారు దిగి, ఖరీదైన కోరికలు గలవాళ్ళ పన్నెండేళ్ళ కొడుక్కి ఖరీదైన సిపాయిబొమ్మ కొన్నారు. వాళ్ళు వెళ్ళిపోయాక షాపువాడ్ని ఆ బొమ్మ ధర అడిగాడు.

''ముప్ఫయి ఎనిమిది రూపాయలు''

ఎర్రపూవుల అంగీ ధర! డబ్బస్సలే లేనివాడికీ, డబ్బు ఎక్కువ లేనివాడికీ వికల్పమధికంగా ఉంటుంది. ఉన్న డబ్బు ఏకోరికకీ సరిపోదు. డబ్బు అధికమయ్యే కొద్దీ కోరికలూ పెరుగుతూ పోతాయి. ధనవంతుడికి అంతపాటి సంశయం అస్సలే ఉండదు.

రవి కళ్ళు చెమ్మగిల్లాయి. పొద్దున్నే మరుకుగా ఊరే ద్రవ్యాలు కడుపులో తిరుగుతున్నాయి. కళ్ళు ఆకలితో బైర్లు కమ్ముతున్నాయి. ఆకలి ఆరోగ్యమైన శరీరలక్షణం. ఈ శరీరానికి పేదరికమన్నది ఎప్పుడర్థమవుతుంది? శరీరం ఉద్రేకంగా కోరుకుంటూ ఉంటే బుద్ధి కాంప్రమైజ్ చేయలేదు. ఆ శారీరక నివేదన ఆరోగ్య లక్షణమే కానీ, వ్యసన దుష్పరిణామమే కానీ.. కాంప్రమైజ్ అవడం కూడా ఒక భోగ్యమే.

బన్ను తిన్నట్లు బుద్ధి అబద్ధమాడింది. కడుపు అబద్ధమాడలేకపోతోంది. చేతిలో చిల్లిగవ్వ లేదు, బస్ స్టాండులోకి వెళ్ళాడు. అప్పుడే కర్నూలు బస్సు వొచ్చి ఆగింది. చకచకా బస్సు కప్పుమీది కెక్కాడు. ఒక్కొక్క మూటనే దొర్లించి క్రిందికి తోసెయ్యసాగాడు. మూడో మూటకి కళ్ళు చీకట్లుకమ్మి పడిపోయాడు. సూర్యకిరణాలు తీక్షణంగా తాకి శరీరం సుడిలో తిరిగినట్లవుతోంది. ప్రాతఃకాలపు సూర్యరశ్మి పొట్టి కడుపుమీదికి హింసగా పరిణమిస్తోంది.

ఎవరో బస్సు టాపు మీదికొచ్చి ముఖంమీద నీళ్ళు చల్లారు. దానంగా వొచ్చిన టీని వద్దని కూలీ పైసలు తీసుకుని టీకొట్టుకి వెళ్ళాడు.

టీకొట్టు యజమాని ఎవరితోనో పోరునపడి బిజీగా ఉన్నాడు.

''గాడిదంత వయసు పైబడ్డా సిగ్గూ శరం లేదు. ఛీ! ఆ పిల్లాడ్ని చూసి బుద్ధి తెచ్చుకో...''

టీకొట్టులో ప్రతి వ్యక్తీ రవి వంక చూశాడు.

'ఆర్నెల్ల నుంచి నా కొట్టుకొస్తున్నాడు. ఒక్కసారైన అప్పు పెట్టలేదు. నీ బాకీ రెండొందలు ఇయ్యందే ఇక్కడ్నుంచి కదలటానికి వీల్లేదు''

నలుగురూ కలిసి ఆ వ్యక్తి షర్టూ, దోవతీ విప్పేశారు. అభాసుపాలవడం అంటే ఇదే.

బన్ను తిని టీ తాగాడు రవి. మరో రెండు బన్నులు తింటే కడుపు నిండుతుంది. కానీ డబ్బుల్లేవు.

రోడ్డు కటువేపు ఉన్న 'సరవణ భవన్' రెస్టారెంటు ఆరోగ్యంగా జనాన్ని శ్వాసిస్తోంది. అవతలికొచ్చే వాళ్ళు సంతృప్తిగా వొస్తున్నారు.. రవి మద్రాసుకొచ్చిన కొత్తలో ఓ సారి ఆ హోటల్లోకి వెళ్ళాడు. ధరల పట్టీ చూసి బెదిరిపోయి వొచ్చేశాడు. అప్పట్నుంచీ ఆ హోటల్‌ని చూస్తే భయం. మధ్యతరగతి మానవుడికి ఫైవ్‌స్టార్ హోటల్లోకి వెళ్ళాలంటే కలిగే భయం. సంకోచస్వభావుడికి పార్టీల్లో ఇరుక్కుంటే కలిగే ఆందోళన.

మధ్యాహ్నం వరకల్లా అరటిపళ్ళు కొనుక్కొని అంబికా క్లాత్ ప్యాలెస్ వెళ్లాడు. కిషన్ టిఫిన్ క్యారియర్ తెచ్చాడు. ఇద్దరూ డాబామీదికెళ్ళి కూర్చున్నారు.

''ఇదేమిటి? పొట్టి అరటిపళ్ళే?''

''ఊఁ!''

''అన్నం తిన్నాక చివరికి తింటారు అరటిపళ్లని''

''నాకిదే అన్నం''

వేదాంతం మనోహరాచారి

"అయితే నాది కొంచెం తీసుకో"

"వొద్దు"

"ఏం?"

"ఎవరన్న సహాయం చేస్తే ఏమనాల్నో తెలువదు.

సహాయం చేసినోండ్లని చూస్తే భయంగ, సిగ్గుగ ఉంటది"

కిషన్‌కి అర్థం కాలేదు.

"నువ్వేమీ అనాల్సి నవసరం లేదు. తీసుకో"

"వొద్దు"

ఎదుటి వ్యక్తిని ఒప్పించడం ఒకకళ. కిషన్‌లో ఆ కళ లేదు.

"నువ్వు మద్రాసు కెందుకొచ్చావు రవీ?"

"సుప్రీం హీరో చిరంజీవిని చూసి బెందుకొచ్చిన!"

"నల్గొండ నుంచి మద్రాసుకా...?"

"ఆ... ఇంట్ల తెలువకుండ రాత్రిళ్ళ పోస్టర్లతికించి, పైసలు జమచేసి, హైదరాబాదుకి బస్సెక్కి, నాంపల్లిల రైలెక్కి... చాల కష్టపడ్డ కిషన్"

"తిరిగి ఇంటికి వెళ్ళిపోరాదూ?"

"అక్కడుండలేకనే ఇక్కడికొచ్చిన. చిరంజీవి తీర్గ హీరోనై పోవాలని వొచ్చిన"

"ఇంట్లో ఎందుకు నచ్చలేదు? మీ అయ్య కొట్టెటోడా?"

"ప్చ్! అదంత అడుగకు"

"నీ పిచ్చి గాకపోతే... ఎర్రపూవులంగీ కొనలేనోడివి హీరోవెలా అవుతావు? ఆలోచించు రవి"

"అదంత నాకు తెలవదు" మొండికేసిన వాళ్ళు న్యాయపరవడానికి ప్రయత్నించరు. వాదించరు.

కిషన్ తిని ముగించేవరకూ రవి ఏమీ మాట్లాడలేదు. డాబా మీది నుంచి రాజాచార్ వీధివైపు చూశాడు.

"హయ్యా! చిరంజీవి కారు!"

"ఏదీ?"

"అగో! *TSA9009*, ఎర్రమారుతీ!"

ఆ తరువాత రెండు రోజులు కనిపించలేదు రవి. ఏది ఎలాగైనా పాతబడిపోయినా ఆకలి మాత్రం ప్రతి పూటా కొత్తగా బలీయంగా ఉంటుంది.

రాత్రి పడుకుని ఎంత కలలు కన్నాడు.

... అంబికా క్లాత్ ప్యాలస్‌లో మసాలదోశెలు తింటున్నారందరూ. ఆలుగడ్డ మసాలా వాసన ఊరంతా వీస్తోంది. ఆకర్షితుడై రవి స్లో మోషన్‌లో అంబికా క్లాత్ ప్యాలస్ లోపలికి అడుగు పెట్టాడు. అందరూ మసాల దోశెలని పక్కకి తోసేసి ఇతడికి సాదరంగా ఆహ్వానం పలికారు. ఎప్పుడూ ఇతడ్ని ఛీదరించుకునే ఎర్రటమ్మాయి చిరునవ్వుతో సందిట చేర్చుకుని తలపై సుతారంగా నిమురుతోంది. వాళ్ళందరూ ఎర్రపూవులంగీని సంబరంగా ప్యాక్ చేసి అపురూపంగా అందిస్తున్నారితడికి. కిషన్ ఇతడికని ప్రత్యేకంగా పళ్ళరసం తీసుకొచ్చాడు...

ఠక్కున నిద్రచెదిరి లేచి కూర్చున్నాడు. ఏది ఉంటే ఈ కల వాస్తవమవుతుంది?

"డబ్బు!" అంది మనస్సు ఉత్సాహంగా.

మూసిన షాపుల వాకిళ్ళలో చాలా మంది బికారులు చలికి ముడుచుకుని నిదురపోతున్నారు. వీధి నిర్మానుష్యంగా ఉంది అని వర్ణించడం ఇలాటి కథల్లో ఆనవాయితి. ఈ వీధి నిర్మానుష్యంగా లేదు. పేదరికం మానవాకారాలుగా ప్రతి వాకిటా శుష్కించి నిస్సారంగా జోగుతోంది. చీకటికౌగిలిలో వాళ్ళ నిదుర నిశ్శబ్దంగా లేదు. ఎప్పుడో మొదలైన ఆకలి మూలుగులై పొట్టకడుపుతో పడుకున్న ప్రతి వ్యక్తినీ మెలికలు తిప్పేస్తోంది. వీధి అంతా యాతనతో గొణుగుతూ ఉన్నట్లు ఉంది. నిగ్రహం ఇంకా అలవడని పసికందు ఎక్కడో చీకట్లో అనాకారంగా గింజుకుని ఏడుస్తోంది.

తూర్పువైపు చూపుని సారించి తొలి ఉషస్సు కాంతి కోసం ఎదురు చూడసాగాడు రవి.

తొమ్మిది గంటలకు అంబికా క్లాత్ ప్యాలస్‌ని తెరిచారు. రవిని చూడగానే కిషన్ అవతలికి వొచ్చాడు.

"కిషన్ ఇంగో మూడు రూపాయలు!"

కిషన్ వెలిబుచ్చిన సంతోషంలో మిత్రప్రీతి కనిపించింది.

"అయితే లోపలికి రా. రాత్రే రాలేదేం?"

"నే వచ్చేసరికి మీరు మూసేసిండ్రు"

రవికి అంబికా క్లాత్ ప్యాలస్‌లోకి ప్రవేశించడం అద్భుతమైన ఓ అనుభూతి! డబ్బు ఇచ్చిన హోదాతో వొచ్చిన అనుభూతి.

ఎర్రటమ్మాయి చిరునవ్వుతో చూసింది. ఆమెకు బిచ్చగాళ్లంటే 'అసహ్యం'!

"మా వాడు కొనడానికొచ్చాడు తెలుసా? గీతక్కా! ఆ ఎర్రపూవులంగీని ఇలా పడేయి. మేస్టారూ! షర్టుకి బిల్లు రాసేయండి" కిషన్ కంఠంలో ధ్వనించిన సగర్వానికి రవి తబ్బిబ్బయ్యాడు.

"కిషన్! ఆ ముప్ఫయి అయిదు రూపాయలిటెయ్యి" ఉత్సాహంగా తీసిచ్చాడు కిషన్. మొత్తం ముప్ఫయి ఎనిమిది రూపాయలు— జేబులో! గుండెల్నిండా గాలి పీల్చుకుని తలపంకించాడు రవి. షాపులో అందరూ అతడిని కళ్లప్పగించి చూశారు. గీత అనే అమ్మాయి ఎర్రపూవుల అంగీని ప్యాక్ వేస్తోంది.

అనూహ్యంగా రవి మనస్సులో ఒక బింబం కదలాడింది. కడుపులో పేగులు ముడిపడుతూన్న భావన. ఎవరూ ఊహించని విధంగా వీధిలోకి పెరుగెత్తాడు. కిషన్ అవాక్కయి అవతలికొచ్చి చూశాడు.

....శరీరం వేలార్చే నివేదనను బుద్ధి కాంప్రమైజ్ చేయలేదు...

రవి 'సరవణ భవన్'లోకి వెళ్ళడం కనిపించింది. కిషన్ పెదవులకు కన్నీరు ఉప్పగా తగిలింది!

